సాక్షి ఖమ్మం

బుధవారం । 3 । జూలై । 2024



కౌన్సెలింగ్‌కు వేళాయె...

ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 6న కౌన్సెలింగ్ మొదలుకానుండగా 4వ తేదీ నుంచి విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోవచ్చు. 8లో



తుక్కులోనూ కుంభకోణం?

పాల్వంచ కేటీపీఎస్‌లోని పాత ప్లాంట్ నుంచి తుక్కు తరలింపు వ్యవహారంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. పలు ప్రాంతాల్లో జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

విద్యార్థుల హాజరు పెంచడంపై దృష్టి

ఖమ్మంఅర్బన్: విద్యార్థుల హాజరుశాతం, కనీస సామర్థ్యాలు పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. ఖమ్మంలోని రిక్కా బజార్ పాఠశాలలో మంగళవారం ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, కామేపల్లి, సింగరేణి, తిరుమలాయపాలెం మండలాల ఎంఈఓలు, హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, తల్లిదండ్రులతో సమావేశాలు, కిచెన్ గార్డెన్ల నిర్వహణ, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులపై సమీక్షించిన డీఈఓ పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెరిగేలా బేస్‌లైన్ టెస్ట్‌లు నిర్వహించాలని తెలిపారు. వివిధ విభాగాల అధికారులు రవికుమార్, ప్రసాద్, రామకృష్ణ, భానుప్రకాశ్, ఎంఈఓలు ఎం.శ్రీనివాస్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య బృందాల ఇంటింటి సర్వే



సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ మాలతి

రఘునాథపాలెం: మండలంలోని పుటానితండా, సూర్యాతండాల్లో వైద్యబృందాలు ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టాయి. ఈ తండాల్లో కిడ్నీ బాధితులు ఎక్కువగా ఉండడానికి కారణాలు ఆరా తీయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల ఆదేశించారు. దీంతో మంగళవారం నుండి ప్రారంభించిన సర్వేను డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు పరిశీలించారు. మండల వైద్యాధికారి బాలకృష్ణ ఆధ్వర్యాన నలుగురు వైద్యులతో కూడిన నాలుగు బృందాలు ఇంటింటి సర్వే చేస్తున్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వివరాలు ఆరా తీస్తుండగా, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన వివరాలు కూడా నమోదు చేస్తున్నారు.

ప్రశాంతంగా డీఏఓ పరీక్ష

ఖమ్మం సహకారనగర్: డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ల(డీఏఓ)ల నియామకానికి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పరీక్షలు కొనసాగుతున్నాయి. జిల్లాలో ఎనిమిది కేంద్రాలు ఏర్పాటుచేయగా మంగళవారం ఉదయం 1,470 మందిలో 569మంది, మధ్యాహ్నం పరీక్షకు 566మంది హాజరయ్యారని అధికారులు వెల్లడించారు.

డీసీహెచ్‌ఎస్‌గా రాజశేఖర్‌నే కొనసాగించండి

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్‌ఎస్)గా రాజశేఖర్ గౌడ్‌నే కొనసాగించాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ జె.అజయ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది ఆగస్టులో డీసీహెచ్‌ఎస్‌గా బి.వెంకటేశ్వర్లు స్థానంలో రాజశేఖర్‌గౌడ్‌ను నియమించారు. దీనిపై వెంకటేశ్వర్లు హైకోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు రావటంతో అప్పటి నుండి ఆయనే డీసీహెచ్‌ఎస్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల రాజశేఖర్‌గౌడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో విచారించిన న్యాయమూర్తులు బి.వెంకటేశ్వర్లు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు చెందిన అధికారి కావడంతో వైద్య విధాన పరిషత్‌కు చెందిన రాజశేఖర్‌గౌడ్ మాత్రమే ఇన్‌చార్జ్ డీసీహెచ్‌ఎస్‌గా కొనసాగే అర్హత ఉందని తీర్పు చెప్పారు. దీంతో ఆయన డీసీహెచ్‌ఎస్‌గా నియమిస్తూ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు పరీక్షలు



విద్యార్థి ఎత్తు కొలుస్తున్న కోచ్

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలక జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 55 మంది విద్యార్థులు హాజరుకాగా, ఎత్తు, బరువుతో పాటు వివిధ ఈవెంట్లలో పరీక్షలు నిర్వహించారు. జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన వారి జాబితా రెండు రోజుల్లో ప్రకటిస్తామని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎంపిక పోటీలను కోచ్‌లు, పీడీలు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, ఎం.సుధాకర్, కృష్ణమూర్తి, కృష్ణయ్య, విజయకుమారి పర్యవేక్షించారు.

రగులుతున్న భూవివాదాలు

- అధికారులు చుట్టూ బాధితుల ప్రదక్షిణలు
- ఏళ్లుగా సమస్యలు పరిష్కారం కాక ఆవేదన
- గ్రామాల్లో తరచూ ఘర్షణలు, ఆపై బలవన్మరణాలు
- వరుసగా ఎన్నికలతో పెండింగ్‌లో రెవెన్యూ సమస్యలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: భూ వివాదాలతో గ్రామాల్లో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఏళ్ల తరబడి తిరిగినా సమస్యలు పరిష్కారం కాక విసిగిపోతున్న పలువురు విపరీత చర్యలకు పూనుకుంటున్నారు. కొందరు దాడులకు తెగిస్తుండగా.. మరికొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో భూమికి సంబంధించి వివిధ సమస్యలు రైతులను వేధిస్తున్నాయి. స్థానికంగా తహసీల్దార్, ఆర్డీఓ, ఆపై పోలీసులను ఆశ్రయించినా ఎంతకూ ముడిపడడం లేదు. చివరకు కలెక్టరేట్‌కు వచ్చి గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ప్రజావాణి కార్యక్రమంలో భూ సంబంధిత సమస్యలపై 252 వినతులు రాగా 38 మాత్రమే పరిష్కారమయ్యాయి. ఉన్నతాధికారులు భూసంబంధిత సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తేనే గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నా వరుస ఎన్నికలతో ఆలస్యమైందని చెబుతున్నారు. చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన రైతు ప్రభాకర్ సోమవారం ఆత్మహత్య చేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించిన నేపథ్యాన భూసమస్యలు మరోమారు తెరపైకి వచ్చాయి.

గ్రామాల్లో ఘర్షణలు

భూవివాదాలతో గ్రామాల్లో ఘర్షణలు.. కక్షలు, కార్పణ్యాలు పెరుగుతున్నాయి. కుటుంబీకుల మధ్య, పక్కపక్కన భూములు కలిగి ఉన్న వారి మధ్య గొడవలు సాధారణమయ్యాయి. వీరి మధ్య సయోధ్య కుదరక.. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగి ఘర్షణకు దిగుతున్నారు. గ్రామాల్లో బలవంతులదే పైచేయిగా ఉండడం.. కొందరికి నాయకులు కొమ్ము కాస్తుండడంతో ఎదుటి వారు నిస్సహాయులుగా మిగులుతున్నారు.



ప్రభాకర్ భార్యాపిల్లలతో కలిసి రోదిస్తున్న తండ్రి పెద్దవీరయ్య

అధికారులు స్పందిస్తే బతికేవాడేమో...

- ప్రొద్దుటూరు రైతు మృతిపై కుటుంబీకుల ఆవేదన
- ఇప్పుడు తమకు దిక్కెవరని ఆందోళన

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన రైతు బోజెడ్ల ప్రభాకర్ భూసమస్యపై అధికారులు సరిగ్గా స్పందిస్తే ఆత్మహత్య చేసుకునే వాడు కాదని కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలోని తన వ్యవసాయ భూమిలో ప్రభాకర్ గత వేసవికాలంలో సుమారు రూ.8 లక్షలు వెచ్చించి మొరం తోలించాడు. చెరువు శిఖంలో మట్టి పోశాడని గ్రామానికి చెందిన మత్స్యశాఖ సొసైటీ సభ్యులు ఐదు రోజుల క్రితం వెళ్లి సుమారు మూడెకరాల్లో మట్టి తీయించారు. ఈ విషయమై ప్రభాకర్ తహసీల్దార్, ఎస్సై, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. కానీ అధికారులు సిబ్బందిని పంపించి వదిలేశారే తప్ప పూర్తిస్థాయిలో స్పందించలేదన్న ఆవేదనతో గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలవాలని వెళ్లాడు. ఆయన వెళ్లే సరికే సమయం మించిపోవడంతో తన కుమారుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి బోజెడ్ల పెద్ద వీరయ్య వాపోయాడు. ఆత్మహత్య చేసుకున్న తర్వాత హడావుడి చేస్తున్న అధికారులు ముందుగా స్పందించి ఉంటే తన కుమారుడు బతికేవాడని ఆయన కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభాకర్ మృతితో తాము దిక్కులేని వారమయ్యామని, తమతో పాటు ప్రభాకర్ భార్యాపిల్లల పోషణ ఎలా అని ఆయన అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే వారు కరువయ్యారు.

పది మందిపై కేసు నమోదు

రైతు ప్రభాకర్ ఆత్మహత్య ఘటనపై ఖమ్మం అర్బన్ (ఖానాపురం హవేలీ) పోలీస్‌స్టేషన్‌లో ప్రొద్దుటూరుకు చెందిన పది మందిపై కేసు నమోదైంది. ఈమేరకు కూరపాటి కిషోర్, పెంట్యాల రామారావు, గుర్రం నాగమల్లేశ్వరరావు, మొగిలి ముత్తయ్య, మొగిలి శ్రీను, వేల్పుల కోటయ్య, షేక్ సిద్ధయ్య, వేల్పుల నర్సింహారావు, షేక్ సైదులు, మొగిలి మాధవరావుపై సెక్షన్ 108, 3(5) బీఎన్‌ఎస్ చట్టం 2023 ప్రకారం కేసు నమోదు చేశారు. ఇక గ్రామంలో మంగళవారం ప్రభాకర్ అంత్యక్రియలు ముగిసే వరకు వైరా ఏసీపీ రహమాన్, సీఐ సాగర్ ఆధ్వర్యాన భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

మేం కూడా ఆత్మహత్య చేసుకుంటాం..

ప్రభాకర్ ఫిర్యాదుతో భూమి పరిశీలనకు సిబ్బంది వెళ్లినప్పుడు మత్స్యకారుల కుటుంబాలు సమస్య చెప్పుకున్నట్లు తెలిసింది. సరైన న్యాయం చేయకపోతే చేపల వేటపై ఆధారపడిన 70 కుటుంబాలు ఉపాధి కోల్పోతాయని చెప్పినట్లు సమాచారం. ఇదే జరిగితే ఆత్మహత్యకు వెనుకాడేది లేదని వారు పురుగుల మందు డబ్బాలతో నిరసన తెలిపిన వీడియో మంగళవారం బయటకు వచ్చింది.

ఇటీవల వెలుగుచూసిన భూసమస్యల్లో కొన్ని..

- సత్తుపల్లి మండలం నారాయణపురానికి చెందిన వంట్ల వెంకటఅప్పారావు, వెంకటేశ్వరరావు, వెంకటసత్యనారాయణ అన్నదమ్ములు. పెద్దవాడైన వెంకటఅప్పారావు ఒక్కడే తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన భూమి అనుభవిస్తున్నాడని తమ్ముళ్ల ఆరోపణ. గతనెల 25న వెంకటఅప్పారావు, ఆయన భార్య సత్యవాణి భూమిలో గడ్డి కోస్తుండగా ఆయన తమ్ముళ్లు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ అడ్డుకున్నారు. దీంతో వారి నడుమ వాగ్వాదం, పెనుగులాట జరిగాయి. ఈక్రమంలోనే సత్యవాణి చేతిలో ఉన్న కొడవలి సత్యనారాయణ ఛాతిపై బలంగా తగలడంతో తీవ్రగాయమైంది.
- నేలకొండపల్లి మండలం మంగాపురం తండాలో భూతగాదాల కారణంగా భూక్యా పుష్పపై అదే గ్రామానికి చెందిన కొండలరావు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గత 28న బైక్‌పై తన భర్త రాంచంద్రుతో కలిసి ఆమె వెళ్తుండగా కొండలరావు అడ్డగించి దాడి చేశాడు.
- కొణిజర్ల మండలం మోకాలకుంటలో భూమి దారి విషయమై పక్క పొలం రైతు, ఆయనకు కౌలు చేసే వ్యక్తిని నడుమ ఘర్షణతో భూక్యా సక్రియా గతనెల 21న ఆత్మహత్య చేసుకున్నాడు. సింగరాయపాలెంలో దారి విషయమై గతనెల 23వ తేదీన బొల్లెపోగు వెంకటి అదే గ్రామానికి చెందిన కంకణాల చిన్న శ్రీను, ఆయన కుమారుడు అవినాష్‌పై గొడ్డలితో దాడి చేశాడు. మండలంలోని లక్ష్మీపురం సమీపాన ఖమ్మంలోని బీలీఫ్ ఆస్పత్రి యాజమాన్యం 31 ఎకరాలు కొనుగోలు చేసి సుమారు 50 ఏళ్లుగా రైతులు ఉపయోగిస్తున్న రహదారిని ఆక్రమించుకొని కంచె ఏర్పాటు చేయడంతో రైతులు ఫెన్సింగ్ రాళ్లను తొలగించి కేసు పెట్టారు.
- తల్లాడ మండలం వెంకటాపురంలో భూమి విషయంలో గతనెల 6న అన్నదమ్ముల మధ్య వివాదం నెలకొంది. దీంతో అన్న నేలవెల్లి వెంకటేశ్వరరావు ఇంట్లో నిద్రిస్తున్న సమయాన తమ్ముడు నరసింహారావు మరికొందరిని తీసుకొచ్చి అన్నావదినపై దాడి చేశారు.
- తమ భూమి వేరే వారి పేరిట రిజిస్ట్రేషన్ చేస్తున్నారని మార్చిలో రఘునాథపాలెం మండలం బూడిదంపాడుకు చెందిన రైతు సాజీరావ్, ఆయన కుమారుడు తహసీల్ ఎదుట ఆందోళన చేశారు. అంతకు ముందు గత ఏడాది అక్టోబర్‌లోనూ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

ఫిర్యాదులపై తక్షణ స్పందన

- పెండింగ్ ఫైళ్ల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం
- పారిశుద్ధ్యం, సమస్యలపై ప్రత్యేక దృష్టి
- గ్రీవెన్స్ కోసం త్వరలోనే యాప్
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఖమ్మం మయూరి సెంటర్: 'ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి, సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ఫైళ్లు పెండింగ్ ఉండకుండా క్లియర్ చేయాలని అధికారులు, సిబ్బందికి సూచించా. వర్షాకాలంలో పారిశుద్ధ్య సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. కార్పొరేషన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తా'. అని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అభిషేక్ 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే...

వారం గడువు...

కార్పొరేషన్ పరిధిలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తాం. ఫిర్యాదులను పరిశీలించి ఆయా విభాగాల అధికారులు సత్వరమే పరిష్కరించేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఇందుకోసం ఓ యాప్ తయారు చేయాలని నిర్ణయించాం. గ్రీవెన్స్‌కు అందే పిర్యాదులను వారంలోగా పరిష్కరించాలనేది లక్ష్యం.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

నగర ప్రజల నుంచి ఇతర అంశాలపై అందే ఫిర్యాదులతో పాటు పారిశుద్ధ్యంపైనా ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఇప్పటికే డ్రెయినేజీల్లో సిల్ట్ తొలగించే పని చివరి దశకు చేరింది. పారిశుద్ధ్య సమస్యను ప్రజలు మా దృష్టికి తీసుకొచ్చేలా ప్రతీ డివిజన్‌కు ఒక సెల్ నంబర్ కేటాయిస్తాం. ప్రజలు ఆ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరిస్తే సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. ఫాగింగ్ కూడా నిరంతరం కొనసాగేలా చూస్తాం. దోమలు వృద్ధి చెందకుండా డ్రెయినేజీల్లో యాంటీ లార్వా స్ప్రే చేయిస్తున్నాం. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం.

గడువులోగా అనుమతులు

ఇంటి నిర్మాణ అనుమతుల కోసమే కాక పేరు మార్పిడి, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇతర సమస్యలపై అందే దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తాం. ఆన్‌లైన్‌లో వచ్చిన వాటిని పరిశీలించి గడువులోగా అనుమతులను జారీ చేస్తాం. ఈ విషయంలో ఇప్పటికే రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించి సూచనలు ఇచ్చా. ప్రజల నుంచి అందే ఏ దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండొద్దనేదే నా భావన.

విలీన పంచాయతీలపై దృష్టి

ఖమ్మం కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామపంచాయతీలు, నగర శివారు ప్రాంతాలను పరిశీలించి అక్కడ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తిస్తాం. పూర్తిస్థాయిలో సమస్యలు తెలుసుకుని ఆయా ప్రాంతాల అభివృద్ధికి బడ్జెట్‌లో 1/3వ వంతు నిధులను కేటాయిస్తాం. అన్ని ప్రాంతాలు సమానస్థాయిలో అభివృద్ధి జరిగేలా కృషి చేస్తా.

ఏడాదిన్నరలోగా 'సీతారామ' పూర్తి



దమ్మాయిగూడెంలో సొరంగమార్గం పనులపై ఆరా తీస్తున్న మంత్రి పొంగులేటి, అధికారులు, ప్రజాప్రతినిధులు

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మున్నేరు, ఆకేరు నదుల ద్వారా పాలేరుకు జలాలు
- పనుల పరిశీలన, అధికారులతో సమీక్ష

తిరుమలాయపాలెం/కూసుమంచి: రానున్న సంవత్సరన్నర కాలంలో సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ వద్ద మున్నేరు, తోడేళ్లగూడెంలో ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రి తిరుమలాయపాలెం మండలంలోని తిప్పారెడ్డిగూడెం వద్ద ఆకేరుపై నిర్మించిన అక్వాటెక్ట్, కాల్వ పనులు, సొరంగ మార్గాలను పరిశీలించారు. అలాగే, కూసుమంచి మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశాల్లో మంత్రి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.18వేల కోట్ల నిధులతో 3.5లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తామంటూ రూ.8,500 కోట్లు వెచ్చించినా ఒక్క ఎకరాకు నీరివ్వలేదని ఆరోపించారు. ఈనేపథ్యాన అధికారంలోకి వచ్చిన తాము సీతా రామ ట్రయల్ రన్ కూడా చేపట్టామని, రెండో లిఫ్ట్ సైతం త్వరలో పూర్తిచేసి ఆగస్టు 15నాటికి నాగార్జునసాగర్ ఆయకట్టు 1.5లక్షల ఎకరాలతో పాటు వైరా, లంకాసాగర్ రిజర్వాయర్లు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు నీరు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ఏన్కూరు సమీపాన కెనాల్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండగా, ఆగస్టు 15 నాటికి పూర్తిచేస్తామని తెలిపారు. అంతేకాక అటవీ అనుమతుల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు వివరించారు.

గ్రావిటీ ద్వారా పాలేరుకు జలాలు

పాలేరు రిజర్వాయర్‌లో సీతారామ కాల్వ కలిసే చివరి ప్రాంతాన ఎనిమిది కి.మీ. మేర టన్నెల్ నిర్మాణం చకచకా సాగుతోందని మంత్రి పొంగులేటి తెలిపారు. సీతారామ ప్రాజెక్టు కాల్వలు మున్నేరు, ఆకేరు నదులను దాటి వెళ్తున్న నేపథ్యాన ఎత్తిపోతల పథకాలు లేకుండా గ్రావిటీ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు నీళ్లు ఇవ్వొచ్చని చెప్పారు. ఇక గత ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణాన్ని విస్మరించగా.. తాము 10నుండి 12 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కాగా, సీతారామ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులు తమకు పరిహారం అందలేదని మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌ను ఆదేశించారు. అనంతరం మంత్రి వివిధ శాఖల అధికారులతో సమావేశమై పాలేరు నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించకుండా, పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే, కూసుమంచిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు గురువాయిగూడెం రోడ్డులోని పూర్వ రెవెన్యూ అకాడమీ భవనాన్ని మంత్రి పొంగులేటి పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్, ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్, ఎస్‌ఈ నర్సింగరావు, డీఈ బాణాల రమేష్‌రెడ్డి తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ, ఎంపీడీఓ శేషాద్రి, ఎంపీపీ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, నాయకులు రాయల నాగేశ్వరరావు, చావా శివరామకృష్ణ, రామసహాయం నరేష్‌రెడ్డి, నెల్లూరి భద్రయ్య, తమ్మినేని నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జీటీ–1 ట్రాన్స్‌ఫార్మర్ మార్చాల్సిందే!

బీహెచ్‌ఈఎల్ అధికారుల నివేదిక

మణుగూరు టౌన్: మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో యూనిట్–1 జనరేషన్ ట్రాన్స్‌ఫార్మర్ శనివారం రాత్రి దగ్ధమైన విషయం విదితమే. ఈ నేపథ్యాన భోపాల్ నుంచి వచ్చిన బీహెచ్‌ఈఎల్ అధికారులు కాలిపోయిన జీటీ–1 ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి మరమ్మతులకు అవకాశం లేదని తేల్చిచెప్పినట్లు సమాచారం. తొలుత బీహెచ్‌ఈఎల్‌దే బాధ్యత అని భావించినా, సీఓడీ అయ్యాక ఏడాది వరకు మాత్రమే బీహెచ్‌ఈఎల్ బాధ్యత వహిస్తుందని నిర్ధారణకు వచ్చారు. అలాగే, బీమా కంపెనీ అధికారులు రూ.9 కోట్ల మేర రికవరీ అయ్యే అవకాశం ఉందని వెల్లడించినట్లు తెలిసింది. ఈ మేరకు మహారాష్ట్రలోని అమరావతి వద్ద 250 మెగావాట్ల జీటీ ఉన్నట్లు తెలియగా, అసోంలోని ఎన్‌టీపీసీ వద్ద 270 మెగావాట్లది ఉన్నట్లు తెలియడంతో వివరాలు ఆరా తీస్తున్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను భోపాల్ పంపి మరమ్మతు చేయించాలంటే ఆరు నెలలు, కొత్తది అమర్చడానికి మూడు నెలలు పడుతుందని సమాచారం. దీంతో మరింత త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చేలా ఎక్కడైనా ప్లాంట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులో ఉందా అని ఆరా తీస్తున్నారు.

వన మహోత్సవం!

- జిల్లాలో నేటి నుండి ప్రారంభం
- 31.06లక్షలు మొక్కలు నాటేలా ప్రణాళిక
- సత్తుపల్లిలో ప్రారంభించనున్న మంత్రులు

ఖమ్మంవన్‌టౌన్: అంతరించిపోతున్న అడవులను కాపాడడంతో పాటు పర్యావరణ రక్షణకు గత కొన్నేళ్లుగా చేపడుతున్న హరితహారాన్ని ఈ ఏడాది కొనసాగించాలని ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. అయితే, 2015నుంచి హరితహారం పేరిట కొనసాగుతున్న ఈ కార్యక్రమాన్ని వన మహోత్సవంగా నిర్వహించాలని సంకల్పించింది. ఈ ఏడాది జిల్లాలో 31.06లక్షల మొక్కలు నాటాలని వివిధ ప్రభుత్వ శాఖలకు లక్ష్యంగా నిర్దేశించారు. ఈమేరకు జిల్లాలోని లంకపల్లి, సత్తుపల్లిలో బుధవారం రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మొక్కలు నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

జిల్లా వ్యాప్తంగా 31.06లక్షలు

జిల్లాలో ఈ ఏడాది 31.06లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ్ విక్రమ్‌సింగ్ వెల్లడించారు. తెలిపారు. కాగా, ఇప్పటివరకు హరితహారంలో భాగంగా పదేళ్లలో కోట్ల మేర మొక్కలు నాటారు. అయితే, సంరక్షణ లోపాలపై విమర్శలు వచ్చాయి. దీంతో ఈసారి ఎక్కడా లోటుపాట్లు ఎదురుకాకుండా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నేతృత్వాన వనమహోత్సవాన్ని జిల్లాలో పండుగ వాతావరణంలో నిర్వహించాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వజ్రోత్సవం...

1950లో కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో ఇలాంటి కార్యక్రమాన్ని ప్రారంభించింది.



మొక్కలు నాటనున్న లంకపల్లి సెక్షన్‌లో పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, అధికారులు

ప్రస్తుతం 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా 'వజ్రోత్సవ వనమహోత్సవం'గా నామకరణం చేసి రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ఈమేరకు జిల్లా, రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాస్థాయిలో పర్యవేక్షణ బాధ్యతలు కలెక్టర్‌కు అప్పగించగా.. ఊరూరా మొక్కలు నాటనున్నారు.

పండ్లు, పూల మొక్కలకు ప్రాధాన్యత

వజ్రోత్సవ వన మహోత్సవంలో ఈసారి పండ్లు, పూల మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అడవుల నుండి మైదాన ప్రాంతాలకు వచ్చిన కోతులు తిరిగి వెళ్లాలనే ఉద్దేశంతో అటవీశాఖ ఆధ్వర్యాన శివారు ప్రాంతాల్లో ఎక్కువగా పండ్ల మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు డీఎఫ్‌ఓ తెలిపారు. మిగిలిన శాఖల ఆధ్వర్యంలో అవెన్యూ ప్లాంటేషన్‌తో పాటు ఇతర జాతుల మొక్కలు నాటతారు. అలాగే, ఇళ్లలో నాటేందుకు పండ్లు, పూలమొక్కలను పంపిణీ చేయనున్నారు.

శాఖల వారీగా నాటనున్న మొక్కల వివరాలు (లక్షల్లో)

డీఆర్డీఏ	10
అటవీ శాఖ	7.60
మున్సిపల్	4.78
వ్యవసాయ, సహకార శాఖ	2.70
ఇంధన శాఖ, సింగరేణి	1.32
నీటిపారుదల శాఖ	1.06
ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ	1.80
రెవెన్యూ, ఎక్సైజ్ శాఖ	0.60
గనుల శాఖ	0.60
ఎడ్యుకేషన్	0.30
పరిశ్రమల శాఖ	0.30
మొత్తం	**31.06**

నేడు జిల్లాలో మంత్రుల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/సత్తుపల్లి: రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు మంత్రి పొంగులేటి స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురం నుండి మంత్రులు రోడ్డు మార్గంలో సత్తుపల్లి మండలం గొల్లగూడెంకు చేరుకుంటారు. ఆ బీట్ పరిధి పెనుబల్లి మండలం లంకపల్లి సెక్షన్‌లోని భూములతో పాటు సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కాలేజీలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటతారు. ఆతర్వాత సత్తుపల్లిలో వనమహోత్సవంపై జరిగే అవగాహన సదస్సు, ర్యాలీలో పాల్గొననున్న మంత్రులు హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ బయలుదేరతారు. ఇదే కార్యక్రమంలో మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం పాల్గొనే అవకాశముంది.

క్లుప్తంగా

జెడ్పీ చైర్మన్‌ను సన్మానించిన కేసీఆర్



కమల్‌రాజ్‌ను సన్మానిస్తున్న కేసీఆర్

ఖమ్మం వన్‌టౌన్/మధిర: ఖమ్మం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌ను మంగళవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సన్మానించారు. జెడ్పీ చైర్మన్ల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యాన బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్మన్లతో ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడడంతో పాటు ఇకపై పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కేసీఆర్ సూచించారు.

రైతు ఆత్మహత్యపై మంత్రి తుమ్మల ఆరా

ఖమ్మంవన్‌టౌన్: చింతకాని మండలానికి చెందిన రైతు ప్రభాకర్ ఆత్మహత్యపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో ఆరా తీశారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడమే కాక బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు. కాగా, రైతులెవరూ భూవివాదాల్లో పంచాయితీలు పెట్టుకుని ఆత్మహత్యలకు పాల్పడొద్దని ఆయన సూచించారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు న్యాయం జరుగుతుందని, ఈ విషయమై గ్రామాల్లో పంచాయితీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు

ఖమ్మంఅర్బన్/కూసుమంచి/తిరుమలాయపాలెం: పండ్లతోటలు, ఆయిల్‌పామ్‌తో పాటు కూరగాయలు సాగుచేసే రైతులకు సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం కోసం యూనిట్లు మంజూరు చేయనున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు కె.మీనాక్షి, అపర్ణ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీలకు 90 శాతం రాయితీ వర్తిస్తుందని, ఐదెకరాల లోపు భూమి ఉన్న ఓసీ రైతులకు 90 శాతం, అంతకుపైన ఉన్న ఓసీ రైతులకు 80 శాతం రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. అలాగే, తుంపర సేద్యానికి అన్ని వర్గాల రైతులకు 75 శాతం రాయితీ అందుతుందని తెలిపారు. కాగా, వీటిపై అదనంగా జీఎస్టీని చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు మీసేవ సెంటర్‌లో దరఖాస్తు చేసుకుని, వాటి కాపీలను తమకు అందించాలని సూచించారు.

లారీ ఢీకొని విద్యుత్ స్తంభాలు ధ్వంసం



విరిగిపోయిన విద్యుత్ స్తంభం

సత్తుపల్లిటౌన్: ప్రమాదవశాత్తు లారీ ఢీకొనడంతో రెండు విద్యుత్ స్తంభాలు ధ్వంసమైన ఘటన సత్తుపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. పెద్దపల్లి నుంచి కాకినాడకు బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ స్థానిక హనుమాన్‌నగర్‌లో సైక్లిస్టును తప్పించబోయి అదుపుతప్పి రెండు విద్యుత్ స్తంభాలను ఢీ కొట్టింది. ఈ ఘటనలో స్తంభాలు, తీగలు ధ్వంసమయ్యాయి. అయితే, ఆ సమయాన అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది.

నేడు స్వస్థలానికి విద్యార్థి మృతదేహం

కల్లూరురూరల్: అమెరికాలో ఎంఎస్ చదువుతూ ప్రమాదవశాత్తు ఈత కొలనులో మృతి చెందిన కల్లూరు మండలం చిన్నకోరుకొండికి చెందిన శ్రీనాధరాజు కిరణ్(20) మృతదేహానికి మంగళవారం అక్కడి శాండిల్ ఎస్‌టౌన్‌లో పోస్టుమార్టం పూర్తయినట్లు తెలిసింది. అమెరికాలో చదువుతున్న కల్లూరు మండలానికి చెందిన శ్రీనివాసరావు, కంపాటి ఆంజనేయులు, రెడ్డిచర్ల హన్మంతు, తిరుమలశెట్టి గోపితో పాటు మరికొందరు ఎన్నారైలు కిరణ్ మృతదేహన్ని ఇండియా తరలించేందుకు చేయూతనిచ్చారు. ఈమేరకు విమానంలో హైదరాబాద్‌కు బుధవారం రాత్రి మృతదేహం చేరుకోనుండగా, అక్కడి నుంచి రోడ్డుమార్గంలో చిన్న కోరుకొండికి గురువారం ఉదయం తీసుకురానున్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,100	1,800
పెసలు	7,850	6,300
మిర్చి	18,200	9,000
మిర్చి తాలు	9,000	9,000
ఏసీ మిర్చి	19,500	10,000
ఏసీ తాలు	9,000	9,000
పత్తి	7,300	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,438

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు వేళాయె..

- రేపటి నుంచి స్లాట్ బుకింగ్‌కు అవకాశం
- 6వ తేదీ నుంచి తొలి దశ సర్టిఫికెట్ల పరిశీలన
- మూడు విడతల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో సెంటర్



కౌన్సెలింగ్ నిర్వహించనున్న ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల

ఖమ్మంసహకారనగర్: ఎప్‌సెట్(ఎంసెట్)లో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు ఈనెల 4వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. విద్యార్థుల కోసం ఖమ్మంలోని ఎస్ఆ ర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 4వ తేదీన రిజిస్ట్రేషన్ల నమోదు (స్లాట్ బుకింగ్) మొదలుకానుండగా, తొలి విడత సర్టిఫికెట్ల పరిశీలన 6వ తేదీన ప్రారంభమవుతుంది. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం అభ్యర్థులు తమకు నచ్చిన తేదీ, సమయం ప్రకారం కౌన్సెలింగ్‌కు స్లాట్ బుకింగ్ చేసుకుని హాజరు కావాల్సి ఉంటుంది. జిల్లాలో ఎనిమిది ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. అయితే, జిల్లా విద్యార్థులు రాష్ట్రంలో ఎక్కడి కళాశాలనైనా వెబ్ ఆప్షన్ల ద్వారా ఎంచుకునే అవకాశం ఉంది. 2024–25వ విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ ప్రవేశాల వివరాల కోసం http://tgeapcet.nic.in వెబ్‌సైట్‌లో సమీపంలోని కౌన్సెలింగ్ కేంద్రంలో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

దశల వారీగా కౌన్సెలింగ్ ఇలా...

మొదటి విడత కౌన్సెలింగ్ కోసం ఈనెల 4వ తేదీ గురువారం నుంచి 12వ తేదీ వరకు స్లాట్ బుక్ చేసుకుంటే 6నుంచి 13వ తేదీ వరకు సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. ఆతర్వాత 8నుంచి 15వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, 19వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఆపై 19నుంచి 23వ తేదీ వరకు ఫీజు చెల్లించి కళాశాలల్లో రిపోర్ట్‌చేయాల్సి ఉంటుంది. ఇక రెండో విడతలో ఈనెల 26న స్లాట్ బుకింగ్, 27వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన, 27, 28వ తేదీల్లో వెబ్ ఆప్షన్ల నమోదు, 31వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఆపై 31 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఫీజు చెల్లించి కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. అలాగే, చివరి దశ కౌన్సెలింగ్‌లో భాగంగా ఆగస్టు 8న స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థుల సర్టిఫికెట్లను 9వ తేదీన పరిశీలిస్తారు. ఆయా విద్యార్థులు 9, 10వ తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేస్తే 13న సీట్ల కేటాయింపు జరుగుతుంది. అనంతరం 13నుంచి 17వ తేదీ వరకు ఫీజు చెల్లించి కళాశాలల్లో రిపోర్ట్‌చేయాల్సి ఉంటుంది. ఇక మూడు దశల్లో విద్యార్థులు కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేశాక కళాశాల మార్చుకోవాలనుకుంటే ఆగస్టు 16, 17వ తేదీల్లో అవకాశం కల్పించారు.

అభ్యర్థులు ఏమేం తీసుకురావాలి..

నిర్ణీత తేదీల్లో కౌన్సెలింగ్ హాజరయ్యే విద్యార్థులు అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జిరాక్స్ సెట్లు వెంట తెచ్చుకోవాలి. ఈమేరకు టీజీఎప్‌సెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ మార్కుల మెమోలు, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఇంటర్ టీసీ, ఈ ఏడాది ఏప్రిల్ 01వ తేదీ తర్వాత తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం, స్లాట్ బుక్ చేసుకున్న రశీదుతో పాటు ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులైతే ఈ ఏడాదికి తీసుకున్న సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది.

మధ్యవర్తుల మాటలు నమ్మొద్దు



ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలను ఎంపిక చేసుకోవాలి. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లో మధ్యవర్తుల మాటలు నమ్మొద్దు. ఏమైనా సందేహాలుంటే హెల్ప్‌లైన్ సెంటర్‌లో నేరుగా సంప్రదించవచ్చు. వెబ్ ఆప్షన్లు పెట్టుకునే సమయాన జాగ్రత్తలు తీసుకోవాలి. రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చిన ఫోన్ నంబర్ ఉపయోగంలో ఉండేలా చూసుకోవాలి.

– మాదాల సుబ్రహ్మణ్యం,
ఎప్‌సెట్ హెల్ప్‌లైన్ సెంటర్, కో ఆర్డినేటర్

టార్గెట్ 72 మిలియన్ టన్నులు

- రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి
- వర్షాకాలంలో ఉత్పత్తి తగ్గకుండా చర్యలు
- రాబోయే ఐదేళ్లలో 10 కొత్త గనులు ప్రారంభం
- సింగరేణి సీఎండీ బలరామ్ దిశానిర్దేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఈ ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ డైరెక్టర్లు, ఏరియా జీఎంలతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వర్షాకాలంలో ఉత్పత్తికి విఘాతం కలగకుండా రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. అదే విధంగా ప్రతీ రోజు 13 లక్షల టన్నుల ఓవర్ బర్డెన్ తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశిత లక్ష్యాలను చేరేందుకు వీలుగా హాల్ రోడ్లను ఎప్పటికప్పుడు పటిష్టపరచుకోవాలని, క్వారీల్లో నిలిచిన వర్షపు నీటిని ఎప్పటికప్పుడు పంపింగ్ చేయాలని సూచించారు. ఏదైనా షిఫ్ట్‌లో వర్షంతో ఉత్పత్తికి నష్టం వాటిల్లితే మరుసటి షిఫ్ట్‌లో ఆ నష్టాన్ని భర్తీ చేయాలన్నారు. ఉద్యోగులంతా తమకు కేటాయించిన 8 గంటల పూర్తి సమయం పనిచేసే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.

పది కొత్త గనులు

రాబోయే ఐదేళ్లలో పది కొత్త గనులు ప్రారంభించడంతో పాటు 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సీఎండీ వివరించారు. రాబోయే మూడు నెలల్లో ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. కొత్త గనులకు రావాల్సిన అనుమతులు, ఇతర ఏర్పాట్లను ప్రణాళికాయుతంగాఆ పూర్తి చేయాలని సూచించారు. దీంతోపాటు నూతన ప్రాజెక్టులు, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు, ఇతర కంటిన్యూయస్ మైనర్ల పనితీరుపై సమీక్షలో చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంస్థ డైరెక్టర్లు డి. సత్యనారాయణరావు, ఎన్.వి.కె. శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్ రెడ్డి, జీఎంలు జి.దేవేందర్, రవికుమార్ పాల్గొన్నారు.

వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి

- ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్
- అశ్వాపురంలో పీహెచ్‌సీ, పశు వైద్యశాల తనిఖీ



పశువైద్యశాల సిబ్బందితో మాట్లాడుతున్న పీఓ

అశ్వాపురం: ఏజెన్సీ పరిధి మారుమూల గ్రామాలు, అటవీ ప్రాంతాల ఆదివాసీ, గిరిజనులకు వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి 24 గంటల పాటు వైద్యం అందించాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ సూచించారు. అశ్వాపురం పీహెచ్‌సీ, పశువైద్యశాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులు, ఫార్మసీ, ల్యాబ్ గదులను పరిశీలించడమే కాక చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. అలాగే, ఆశ వర్కర్లతో సమావేశమై సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజనులకు అవగాహన కల్పించాలని సూచించారు. కాగా, పశువైద్యశాలకు వెళ్లిన సమయాన సిబ్బంది సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వెటర్నరీ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ స్వర్ణలత, వైద్యాధికారి సంకీర్తన, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాల, ఈఆర్ఎస్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు తాజా పండ్లు సరఫరా చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఏజెన్సీదారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఆయన జీసీసీ, ఏజెన్సీల ద్వారా పండ్ల సరఫరా టెండర్లు ఖరారు చేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. గిరిజన గురుకులాలు, పాఠశాలల్లో గిరిజన విద్యార్థులకు పండ్ల సరఫరా విషయంలో నిబంధనలు పాటించకపోతే ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై జీసీసీ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఆర్సీఓ వెంకటేశ్వరరాజు, జీసీసీ డీఎం దావీదు, ఏఓ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో మార్పులు

- పేమెంట్ యాప్‌లపై ఆర్బీఐ ఆంక్షలు
- సంస్థ వెబ్‌సైట్, యాప్ లేదా ఈఆర్వో కేంద్రాల ద్వారా స్వీకరణ

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపుల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇన్నాళ్లు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంల ద్వారా ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించే అవకాశముంది. ఈ అంశాన్ని సమీక్షించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా కరెంట్ బిల్లులు స్వీకరించొద్దని ఆదేశించింది. దీంతో మంగళవారం నుంచి యాప్‌ల ద్వారా చెల్లింపులు నిలిచిపోయాయి. ఇక నుంచి ఆయా యాప్‌ల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపునకు టీజీఎన్పీడీసీఎల్ పేరు కనిపించదు. ఫలితంగా ఈఆర్ఓ కేంద్రాల ద్వారా లేదా టీజీఎన్పీడీసీఎల్ యాప్‌తో పాటు డిస్కమ్ వెబ్‌సైట్ https://tgnpdcl.com నుంచి మాత్రమే బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, యాప్, వెబ్‌సైట్‌లో బిల్లులు చెల్లించే సమయాన పేమెంట్ కోసం మాత్రం ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంతో పాటు డెబిట్, క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్ తదితర ఆప్షన్లు ఎంచుకోవచ్చు.

కొంతకాలం ప్రభావం

బిల్లుల చెల్లింపుల్లో వచ్చిన మార్పులు ఆదాయంపై ప్రభావం చూపే అవకాశముందని భావిస్తున్నారు. వినియోగదారులు ఇన్నాళ్లు ఫోన్ పే, గూగుల్, పేటీఎం తదితర మార్గాల్లో సులభంగా బిల్లు చెల్లించేందుకు అలవాటు పడ్డారు. ఇప్పుడు అవేవీ అందుబాటులో లేకపోవడంతో కొంత ప్రభావం పడుతుందనే భావన వ్యక్తమవుతోంది. ఖమ్మం ఎన్పీడీసీఎల్ పరిధిలో ఏడు లక్షల వరకు వివిధ కేటగిరీల్లో విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో డిజిటల్ విధానంలో 1,21,515 కనెక్షన్ల(71.23శాతం) వినియోగదారులు బిల్లులు చెల్లిస్తున్నాయి. ఈ బిల్లులు నెలకు రూ.25 కోట్ల మేర ఉంటాయని అంచనా. ఇప్పుడు మార్పులు చోటుచేసుకున్న నేపథ్యాన వినియోగదారుల్లో అవగాహన కల్పించిచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

భర్త కర్మకాండలు చేస్తున్న మహిళపై దాడి

మధిర: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా కర్మకండలు చేస్తున్న ఆయన భార్యపై మృతుడి బంధువులు దాడికి దిగారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు... బోనకల్ మండలం కలకోటకు చెందిన జార్జి, మధిర మండలం సిరిపురం గ్రామానికి చెందిన సుజాతను ఆరేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి 5 సంవత్సరాల కుమార్తె ఉండగా, ఏడాది కాలంగా కుటుంబ కలహాలతో వేర్వేరుగా ఉంటున్నారు. ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఇంతలోనే తల్లాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జార్జి మృతి చెందాడు. దీంతో సిరిపురం సమీపంలోని వైరా నది వద్ద సుజాత ఆధ్వర్యాన మంగళవారం కర్మకాండలు చేస్తుండగా మృతుని బంధువులు చేరుకుని సుజాత, ఆమె తండ్రిపై దాడికి పాల్పడగా గాయాలయ్యాయి. ఈమేరకు బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మధిర రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి తెలిపారు.

దాడిపై కేసు నమోదు

నేలకొండపల్లి: భూతగాదాల నేపథ్యాన జరిగిన దాడిపై మంగళవారం కేసు నమోదైంది. నేలకొండపల్లి మండలం మంగాపురం తండాకు చెందిన భూక్యా పూషా, ఆమె భర్త రామచంద్రు గత శుక్రవారం సాయంత్రం బైక్‌పై పొలం నుంచి ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన కొండలరావు అడ్డుకుని దాడి చేశాడు. ఈఘటనలో పూషా తీవ్రంగా గాయపడగా బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట నాగరాజు తెలిపారు.

జీటీ–1 ట్రాన్స్‌ఫార్మర్ మార్చాల్సిందే!

- బీహెచ్ఈఎల్ అధికారుల నివేదిక
- కొత్తవి ఎక్కడ ఉన్నాయోనని ఆరా..

మణుగూరు టౌన్: మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో యూనిట్–1 జనరేషన్ ట్రాన్స్‌ఫార్మర్ శనివారం రాత్రి దగ్ధమైన విషయం విధితమే. ఈ నేపథ్యాన భోపాల్ నుంచి వచ్చిన బీహెచ్ఈఎల్ అధికారులు సోమవారం ఉదయం నుంచి మంగళవారం సాయంత్రం వరకు కాలిపోయిన జీటీ–1 ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి నివేదిక అందించినట్లు తెలిసింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా కాలిపోయిన నేపథ్యాన మరమ్మతులకు అవకాశం లేదని తేల్చిచెప్పినట్లు సమాచారం. తొలుత బీహెచ్ఈఎల్‌దే బాధ్యత అని భావించినా, సీఓడీ అయ్యాక ఏడాది వరకు మాత్రమే బీహెచ్ఈఎల్ బాధ్యత వహిస్తుందని నిర్ధారణకు వచ్చారు. అలాగే, బీమా కంపెనీ అధికారులు పరిశీలించి రూ.9 కోట్ల మేర రికవరీ అయ్యే అవకాశం ఉందని వెల్లడించినట్లు తెలిసింది. ఈ మేరకు మహారాష్ట్రలోని అమరావతి వద్ద 250 మెగావాట్ల జీటీ ఉన్నట్లు తెలియగా, అసోంలోని ఎన్‌టీపీసీ వద్ద 270 మెగావాట్లది ఉన్నట్లు తెలియడంతో వివరాలు ఆరా తీస్తున్నారు. ఒకవేళ కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను భోపాల్ పంపి మరమ్మతు చేయించాలంటే ఆరు నెలలు, కొత్తది అమర్చాలంటే మూడు నెలల సమయం పడుతుందని భావిస్తున్నట్లు సమాచారం. దీతో మరింత త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చేలా ఎక్కడైనా థర్మల్ ప్లాంట్‌లో ఈ తరహా ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులో ఉందా అని ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

మావోయిస్టు మిలీషియా సభ్యుడి లొంగుబాటు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ

చర్ల: మావోయిస్టు పార్టీకి చెందిన మిలీషియా సభ్యుడు మంగళవారం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ చర్ల సీఐ రాజువర్మతో కలిసి వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని జెట్టపాడు గ్రామానికి చెందిన మడవి జోగా అలియాస్ ఐత.. పుట్టపాడుకు చెందిన మిలీషియా కమాండర్ మడకం దేవా వద్ద మిలీషియా సభ్యుడిగా చేరి నిత్యావసరాలు, ఇతర సామగ్రి చేరవేస్తు న్నాడు. తర్వాత మడవి జోగా లొంగిపోవాలని నిర్ణయించుకొని స్వచ్ఛందంగా వచ్చి చర్ల పోలీసులను ఆశ్రయించాడని ఏఎస్పీ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కారేపల్లి: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందుతాగిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందాడు. మండలంలోని గుంపెళ్లగూడెంనికి చెందిన బానోతు హర్యా(54) ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స చేయించడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. అయినా భార్యకు నయం కాకపోవడం, ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో మనస్తాపానికి గురైన హర్యా సోమవారం చేను వద్ద పురుగుల మందు తాగాడు. స్థానిక రైతులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు చేరుకుని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఘటనపై ఆయన కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాజారాం తెలిపారు.

తుక్కులోనూ భారీ కుంభకోణం?

- తక్కువ కోట్ చేసి భారీ ఎత్తున స్కాం చేశారనే చర్చ
- ఇప్పటికే కర్మాగారాన్ని రెండు సార్లు సందర్శించిన ఎమ్మెల్యే
- జిల్లా కలెక్టర్ సమక్షంలో అధికారులపై ఆగ్రహం
- తరలింపు పనులకు తాత్కాలికంగా బ్రేక్?



కేటీపీఎస్ పాత ప్లాంట్‌ను తుక్కుగా మార్చిన దృశ్యం

పాల్వంచ: కాలం చెల్లిన కేటీపీఎస్ ఓఅండ్ఎం (పాత ప్లాంట్) నుంచి తుక్కు తరలింపు వ్యవహారం దుమారం రేపుతోంది. ఇప్పటికే కర్మాగారంలోని అనేక కీలక విభాగాలకు చెందిన సామగ్రి తరలింపు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. పనులు చివరి దశకు వస్తున్న క్రమంలో ఇక్కడి తుక్కు అమ్మకం పేరుతో రూ.కోట్లను పక్కదారి పట్టించి భారీ స్కాంకు పాల్పడ్డట్లు ఆరోపణలు వ్యక్తమతున్నాయి. రోజురోజుకూ ఈ వ్యవహారం చిలికిచిలికి గాలి వానగా మారుతుండటంతో పాటు రాష్ట్రవ్యాప్త చర్చకు దారితీస్తోంది. నిబంధనల మేరకు జరుగుతున్నాయంటూ జెన్‌కో యాజమాన్యం చెబుతున్నప్పటికీ తక్కువ కోడ్ చేసి ఆదిలోనే భారీ అవినీతికి పాల్పడ్డారంటు సాక్షాత్తూ స్థానిక ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేయడంపై సందేహాలకు మరింత ఊతమిస్తోంది. దీనిపై ఇప్పటికే కూనంనేని సాంబశివరావు కర్మాగారాన్ని రెండు దఫాలుగా సందర్శించి వెంటనే తరలింపు పనులు నిలిపివేయాలంటూ అధికారులను ఆదేశించారు. గత సోమవారం జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌ను కర్మాగారానికి రప్పించి తరలింపు ప్రక్రియ తీరును వివరించారు. అక్కడే కేటీపీఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తరలింపులో లోపాలెన్నో!

కేటీపీఎస్‌లోని ఏ, బీ, సీ స్టేషన్లను 1966 – 70 దశకంలో నిర్మించారు. ఈ స్టేషన్లు కాలం చెల్లడంతో అందులో విద్యుత్ ఉత్పత్తిని 2019లో నిలిపివేశారు. అప్పటివరకు వినియోగిస్తూ వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు, టర్బైన్లు, కన్వేయర్లు, కూలింగ్ టవర్లు, బాయిలర్లు, చిమ్నీలు, జనరేటర్లు, షెడ్లు, ఇతర బ్లాకులన్నింటిని తుక్కుగా మార్చి కొనుగోలు చేసేందుకు హెచ్ఆర్ కమర్షియల్ సంస్థ రూ.485 కోట్లకు టెండర్ దక్కించుకుంది. ముందుస్తుగా రూ.144 కోట్లు చెల్లించి పనులు ప్రారంభించింది. ప్రతి వస్తువును కట్ చేసి ముక్కలుగా మార్చి తుక్కుగా చేసి తరలిస్తున్నారు. అయితే ఈ తరలింపు ప్రక్రియలో అనేక లోపాలున్నట్లు ఆది నుంచి ఆరోపణలున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత ఆరోపణల నిగ్గు తేల్చేందుకు ఎమ్మెల్యే కూనంనేని ప్రత్యేక దృష్టి సారించారు.

ఆరోపణలు తేల్చేవరకు పనులు ఆపాలి..

పాత ప్లాంట్ కూల్చివేత పనుల్లో అనేక లోపాలున్నాయని, పారదర్శకత లోపించిందని, నిజాలు నిగ్గు తేల్చే వరకు తరలింపు పనులు నిలిపివేయాలని ఎమ్మెల్యే కూనంనేని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌తో కలిసి కర్మాగారాన్ని సందర్శించి అప్పటి ఒప్పంద పత్రాలన్నింటినీ పరిశీలించి లోతుగా అధ్యయనం చేశారు. తాను గత నెల 21వ తేదీన కర్మాగారాన్ని సందర్శించి తుక్కు తరలింపులో అనేక అనుమానాలున్నాయని వాటిని నివృత్తి చేసే వరకు పనులు నిలిపివేయాలని చెప్పినా తన మాట దిక్కరించి పనులు కొనసాగిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కలెక్టర్ వెళ్లిపోయిన తర్వాత పాత తేదీతోనే కూలింగ్ టవర్‌కు అనుమతులు తీసుకున్నట్లు సమాచారం ఉందన్నారు. అంతేగాక టెండర్ ప్రక్రియలోనే తక్కువ కోడ్ చేసి భారీ అవినీతికి పాల్పడ్డారని, తొలగించిన చెట్లు, ఫర్నిచర్ ఎక్కడికి పంపించారని, వాటి వివరాలు పూర్తిగా తెలియాలని పేర్కొన్నారు. ఆగమేఘాల మీద కూలింగ్ టవర్లు కూల్చివేస్తే భవిష్యత్‌లో కొత్త కర్మాగారం వస్తే ఎలాఅని, దీనిపై అధ్యయనం చేయాల్సి ఉందని, భవిష్యత్‌లో అసెంబ్లీలో ఈ సమస్యలన్నీ ప్రస్తావిస్తానని హెచ్చరించడంతో ఈ అంశం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అయితే, తరలింపు పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. ఈ విషయమై 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

అవకతవకలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా



కేటీపీఎస్ పాత ప్లాంట్‌ను ఆగమేఘాల మీద కూల్చాల్సిన అవసరం ఏముంది. ఈ పనులను కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించేప్పుడే తక్కువ కోడ్ చేసి, రూ.కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారు. అనుకున్న దానికంటే ఎక్కువ మొత్తంలో తుక్కు వెళ్లిందనే ఆరోపణలు వస్తున్నాయి. అనుమానాలన్నింటినీ ప్రత్యేక విచారణ కమిటీ వేసి నిజాలు నిగ్గుతేలిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ, పాత ప్లాంట్ స్థానంలో కొత్త ప్లాంట్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి జరిగే అవకాశం ఉంది. ఇక్కడి అధికారుల్లో సైతం పారదర్శకత లోపించింది. ఈ విషయాలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అసెంబ్లీలో ప్రస్తావిస్తా.

– కూనంనేని సాంబశివరావు,
కొత్తగూడెం ఎమ్మెల్యే